గుడిసెల్లోనే తెల్లారుతున్న బతుకులు

సామాన్య మానవుని జీవనానికి అవసరమైన ఏ వసతీ లేకుండా.. తరాలు మారినా.. మారని తలరాతను తల్చుకుంటూ.. నాలుగు దశాబ్దాలుగా వారి బతుకులు గుడిసెల్లోనే తెల్లారుతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. పట్టించుకునే వారు లేక వారి జీవితాలు గుడిసెలకే అంకితమవుతున్నాయి.

- నాలుగు దశాబ్దాలుగా కనీస వసతులు లేక అవస్థలు
- పట్టించుకునే నాథుడే లేడు


అజరయ్య హాస్టల్ సమీపంలో నివాసితుల గుడిసెలు

నందిగామ రూరల్: నందిగామ పట్టణంలో నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్నా.. జనాభా లెక్కల్లో కానీ, ప్రభుత్వ లెక్కల్లో కాని వారు ఉండరు. ప్రజలకు మాత్రం సంచార జాతుల వారుగా పరిచయస్తులు. ఊరూరు తిరుగుతూ బూరలు అమ్ముకుంటూ.. గ్యాస్ పొయ్యిలు, మిక్సీలు రిపేర్లు చేసుకుంటూ.. పాత దుస్తులు కొనుగోలు చేసి విక్రయిస్తూ.. మృతిచెందిన వారిని కాటికి మోసుకెళ్లే జంగదేవరులుగా.. అక్షరం ముక్క వచ్చిన వారు రాతిండి వ్యాపారం చేసుకుంటూ వచ్చిన దానితో పొట్ట పోసుకుంటూ పట్టణంలోని అజరయ్య హాస్టల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని సుమారు 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మూడు పూటలా ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లలేని వారికి ప్రభుత్వ సహకారం లేక అవస్థలు పడుతున్నారు.

నలభై ఏళ్లుగా గుడిసెల్లోనే జీవనం

నాలుగు దశాబ్దాలుగా చిన్నపాటి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. నీటి కోసం బోరు పంపు, తాగునీటికి కుళాయి కానీ లేదని సమీపంలోని ఇళ్ల వారిని బ్రతిమాలి బిందెలతో మోసుకుంటూ తెచ్చుకోవాల్సిందేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరకు విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ నూనె దీపాల వెలుగులో జీవనం సాగించామని చెబుతున్నారు. పాత చీరలతో ఏర్పాటు చేసుకున్న మరుగుదొడ్డిలోనే స్నానాలు సాగిస్తున్నామని వాపోతున్నారు. వర్షాకాలంలో వరద నీరు గుడిసెల్లోకి వస్తోందని, ఆ సమయంలో చిన్న పిల్లలతో మా పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాత చీరలతో ఏర్పాటు చేసుకున్న మరుగుదొడ్డి

అధిక విద్యుత్ బిల్లులతో ఇబ్బందులు

తమ గుడిసెలకు సరిపడ విద్యుత్ మీటర్లు లేకపోవడంతో ఒక్కో మీటరు నుంచి మూడు, నాలుగు గుడిసెలకు విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నామని చెబుతున్నారు. దీంతో వాడకం యూనిట్లు పెరిగి విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ఒక్కో మీటరుకు రూ. వెయ్యి నుంచి 1,500ల వరకు బిల్లులు వస్తుండటంతో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తమ గురించి తెలుసుకుని సొంత ఖర్చుతో విద్యుత్ సౌకర్యం కల్పించారని వారు చెప్పారు. ఆ తర్వాత విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి 11 మందికి విద్యుత్ మీటర్లు ఇప్పించారని గుర్తు చేసుకున్నారు. అంతేకాకుండా తమ దుస్థితిని అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రేషన్ కార్డులున్న వారికి ఇళ్లు, ఇళ్ల స్థలం మంజూరు చేయించారని తెలిపారు. కానీ ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు నిర్మాణ రంగ కూలీలు ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో మా కథ మళ్లీ మొదటికి వచ్చిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రభుత్వాలు ఆదుకోవాలి



నలభై ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మాకు ఇల్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం వంటి వసతులు లేవు. ఏ కాలమైనా గుడిసెలో ముడుసుకుని పడుకోవడమే. ప్రభుత్వం స్పందించి ఇళ్లు, కనీస వసతులు కల్పించాలి.

– బిక్షం, స్థానికుడు

వసతులు లేవు



గత ప్రభుత్వంలో మాకు ఇల్లు, స్థలం మంజూరైంది. కానీ ఇంటి నిర్మాణానికి సరిపడ డబ్బులు లేక కట్టే వారు ముందుకు రాలేదు. గతంలో 50 కుటుంబాల వరకు ఉండే వాళ్లం. వసతులు లేక 20 కుటుంబాలకు పైగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– పస్తం లక్ష్మి, స్థానికురాలు

రైతుబజార్‌లో విక్రయించుకోవచ్చు

జగ్గయ్యపేట అర్బన్: స్థానికంగా టమాటా పండించే రైతులు తమ పంటను ఇక్కడ ఉన్న రైతు బజారులో అమ్ముకోవచ్చని మార్కెటింగ్ శాఖ ఏడీఎం మంగమ్మ అన్నారు. శనివారం మండలంలో పర్యటించిన ఆమె జగ్గయ్యపేట రైతుబజారు పరిధిలో టమాటాలు పండించి తీసుకువచ్చే రైతుల పొలాలకు వెళ్లి వారి పంట పొలాలను పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి టమాటాలు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో పాటు జగ్గయ్యపేట మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకట నరసింహారావు, హార్టికల్చర్ ఆఫీసర్ వర్ధిని, రైతుబజారు ఈఓ వెంకటరమణ, తిరుమలగిరి రైతులు సాంబ, శ్రీను, శివ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ న్యాయవాదులకు ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక ఓసీ క్లబ్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ న్యాయవాదుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు చెరుకుమల్లి రామారావు, శివరామకృష్ణ, కన్నెకంటి జీవరత్నం, షేక్ కరిముల్లా, మట్టా ప్రసాద్, నండ్రు శ్రీరామ్మూర్తి, అద్దంకి మణిబాబు, ఎక్కిరాల హనుమంతరావు, ఆనంద్ విజయ్, మంగళపూడి సన్ని, కోటిబాబు, రాజేంద్ర, కమలాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు పెంచేందుకే శిక్షణ

చందర్లపాడు(నందిగామ రూరల్): విద్యా ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని ఎంఈఓ శ్యాంబాబు పేర్కొన్నారు. చందర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్స్ (సాల్ట్) పథకంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రీస్కూల్ విద్యార్థులకు సులభంగా, నాణ్యమైన విద్యా బోధన చేయడానికి శిక్షణిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బోధనా పద్ధతులు, సంస్థాగత సామర్థ్యాలు, విద్యా రంగంలో నాణ్యత పెంచడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నందిగామకు చెందిన న్యాయవాది తుర్లపాటి వెంకట మార్కండేశ్వరరావు దంపతులు రూ. 25,116లు విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరద్వాజ్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేదాద్రిలో..

గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి తుర్లపాటి వెంకట మార్కండేశ్వరరావు దంపతులు రూ. 20 వేలను విరాళంగా అందజేసినట్లు ఈఓ సురేష్‌బాబు తెలిపారు. పూజల అనంతరం దాతలకు స్వామివారి ప్రసాదం, చిత్ర పటం అందజేశారు.

26 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): మద్యం అక్రమ రవాణా సాగించినా.. విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కేవీ సుధాకర్ పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ సమీపంలోని అనాసాగరంలో సిబ్బందితో కలిసి శనివారం ఆకస్మిక దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో సిద్ధార్థ అనే వ్యక్తి వద్ద నిల్వ ఉంచిన 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రామశేషయ్య, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు మండల నాయకుడు పొన్నం కోటేశ్వరరావు, చిల్లకల్లు గ్రామ నాయకుడు దొంగల సింహాద్రిని జగ్గయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లెప్రా సొసైటీ ఆవిర్భావ దినోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: స్వచ్ఛంద సంస్థ లెప్రా సొసైటీ 36వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం స్థానిక పేట ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ)లో ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అళ్ల హరీష్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. లెప్రా సొసైటీ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త మామిడి రాధిక మాట్లాడుతూ తమ సంస్థ దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో 5 రకాల వ్యాధులపై పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, రాజశేఖర్, శ్రేయస్సు సిబ్బంది, ఆస్పత్రి వైద్య సిబ్బంది, వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నందిగామ రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామ సర్పంచ్ చెరుకూరి హైమారావు సొంత ఖర్చుతో రోడ్డుపై పడిన గుంతలను పూడ్చటంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప, పిచ్చి చెట్లను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి మరమ్మతులు, కంప చెట్లు తొలగించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు నిధులు లేవని చెప్పడంతో సుమారు రూ. 50వేల ఖర్చుతో కొండూరు క్రాస్ రోడ్డు నుంచి తొర్రగుడిపాడు వరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మౌలానా ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు


ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు, మైనార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: స్వాతంత్య్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకమని పేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 67వ వర్ధంతిని శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు, పలువురు మైనార్టీ నాయకులు, పార్టీ నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలోను, దేశ నిర్మాణం దిశగా జరిగిన ప్రయత్నాల్లోనూ ఆజాద్ పోషించిన పాత్ర అనిర్వచనీయమైనదన్నారు. దేశ విభజనను వ్యతిరేకించి.. కలిసే ఉండాలని పట్టుబట్టిన దేశభక్తుడు మౌలానా ఆజాద్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, మాతంగి నాగబాబు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు బద్దూనాయక్, జిల్లా చేనేత విభాగం మాజీ అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు చల్లా సుశీల, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు అన్నెపాగ మురళి, మైనార్టీ నాయకులు షేక్ జావిద్, షేక్ ఖాదరీ, షేక్ మౌలానా, షేక్ సిరాజ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, బీసీ నాయకులు జవ్వాజి నరసింహారావు, దేరంగుల శ్రీను, చాపల వెంకటేశ్వర్లు, రూపన పుల్లయ్య, న్యాయవాది పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ఆర్డీవో బాలకృష్ణ


పేట బాలుర హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శనివారం ఆయన పట్టణంలోని పోలింగ్ కేంద్రంగా ఉన్న జెడ్పీ బాలుర హైస్కూల్‌ను పరిశీలించారు. పోలింగ్ బూత్‌లుగా కేటాయించిన ఆరు గదులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో రక్షణ ఏర్పాట్లు, ఓటర్లకు నీటి సౌకర్యం, విద్యుత్ లైటింగ్, టాయిలెట్లు తదితర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పేట తహసీల్దార్ మనోహర్, ఎలక్షన్ డీటీ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి


కంచికచర్లలో లక్ష్మణరావుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కల్యాణ్

వీరులపాడు: ప్రజా సమస్యలపై పోరాడే పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని పలు ప్రజా సంఘాల నాయకులు కోరారు. మండలంలోని ఆయా గ్రామాలో శనివారం పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు చాట్ల రవి, వట్టికొండ రమేష్, నండ్రు తిరుపతిరావు పాల్గొన్నారు.

కంచికచర్ల: ఈ నెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలిపించాలని వ్యవసాయ కార్మిక శాఖ జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ కోరారు. కంచికచర్లలో ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్, నిరుద్యోగుల్ని, ఉపాధ్యాయులను శనివారం కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ జహిదా, ప్రజాసంఘాల నాయకులు రాజు, ప్రసాద్, నాగయ్య, రామయ్య పాల్గొన్నారు.

నందిగామ టౌన్(నందిగామ రూరల్): కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అభ్యర్థించారు. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ శనివారం పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు కటారపు గోపాల్, గోపీ నాయక్, నారాయణ, శ్రీనివాసరావు, రవి, పలు ప్రజాసంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు


బాలనాగమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, శ్రీదేవీ కళా నాట్యమండలి, కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ప్రదర్శించిన పద్యనాటకాలు నాటక వైభవాన్ని చాటాయి. విద్వాన్ కణ్వశ్రీ రచించిన బాలనాగమ్మ నాటికను మనోహరంగా ప్రదర్శించారు. ఎస్ విజయలక్ష్మి బాలనాగమ్మగా, జెట్టి సాంబశివరావు మాయల ఫకీరుగా, కార్యవర్ధిరాజుగా డీవీ నరసింహారావు, బాలవర్ధి రాజుగా జీవన్‌కుమార్ పాత్రోచితంగా నటించారు. రెండవ నాటికగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ఘట్టాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా సంగీత విద్వాంసుడు కొయ్యూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రత మనందరి బాధ్యత

నందిగామ టౌన్(నందిగామ రూరల్): పురపాలన శాఖ రాజమండ్రి ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్ నాగ నరసింహారావు శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ప్రధాన రహదారులను పరిశీలించి రోడ్డుపై దుకాణదారులు చెత్త వేయడంతో వారితోనే శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా చెత్తా, చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ నివారణపై పురపాలక సంఘం పరిధిలో గోడలపై ఏర్పాటు చేసిన ప్రచార దృశ్యాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుబజార్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించి అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం తొమ్మిదవ వార్డులోని ముక్కపాటి నగర్‌లో పర్యటించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఏఈ ఫణి శ్రీనివాస్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జిల్లాలోని పురపాలక సంఘ కమిషనర్లతో సీహెచ్ నాగ నరసింహారావు సమీక్షా సమావేశం నిర్వహించారు.

వైభవంగా సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు



నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న సిలువగిరి పరిశుద్ధ పుణ్యక్షేత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం రెవ. ఫాదర్ బెన్ని ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త స్వస్థతా ప్రార్థనలు, సమిష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ముందుగా పుణ్యక్షేత్ర రెవ. ఫాదర్ ఫిలోమెన్ రాజు, బెన్నిలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రీస్తు సందేశాన్ని అందించారు. ప్రభువు ఏసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శన, కోలాటం, యేసు భజన, తప్పిపోయిన కుమారుడు నాట్య ప్రదర్శన కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తడి – పొడి చెత్తను విడివిడిగా సేకరించాలి


కంచికచర్లలో క్లాప్ మిత్రలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ రాఘవన్


ముక్త్యాలలో అవగాహన కలిగిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్

కంచికచర్ల: తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ పేర్కొన్నారు. స్థానిక ఒకటవ వార్డులో జరుగుతున్న తడి – పొడి చెత్త సేకరణ విధానాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ మిత్రలు వీధుల్లో ప్రతి ఇంటి నుంచి తడి – పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. వీధుల్లో కాని రోడ్లపై గాని చెత్తను వేయరాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు డ్రైయినేజీల్లో మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బజార్‌లో కుళ్లిపోయిన కూరగాయలు రోడ్లపై వేస్తే చర్యలు తీసుకోవడం జరుతుందని పేర్కొన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బొజ్జగాని శ్రీనివాసరావు, పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి

చందర్లపాడు(కంచికచర్ల): మండలకేంద్రమైన చందర్లపాడు, ముప్పాళ్ల, బొబ్బెళ్లపాడు గ్రామాల్లో తడి , పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలని ఎంపీడీఓ నాంచారమ్మ, ఈఓపీఆర్డీ యేసుబాబు పేర్కొన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తడి – పొడి చెత్త వేర్వేరుగా వేసేందుకు ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కలిగించారు. మండలంలోని ముక్త్యాల గ్రామంలో కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి-పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. బండిపాలెంలో కార్యదర్శి జగ్గయ్య ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలు తడి-పొడి చెత్తను సేకరించారు.

పేటలో 7,367మంది ఎమ్మెల్సీ ఓటర్లు

జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 7,367 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,563మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,804మంది ఉన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో మొత్తం 2,206మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,260 మంది, మహిళలు 946 మంది ఉన్నారు. పేట మండలంలో 2,144 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,322 మంది పురుషులు, 822 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వత్సవాయి మండలంలో మొత్తం 1,482 మంది ఓటర్లు ఉండగా, వారిలో 956 మంది పురుషులు, 526 మంది మహిళలు ఉన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 1,535 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,025 మంది పురుషులు, 510 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

10 పోలింగ్ కేంద్రాలు..

ఈ ఎన్నికల కోసం అధికారులు నియోజకవర్గంలో మొత్తం 10పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో పట్టణ ఓటర్ల కోసం మూడు పోలింగ్ కేంద్రాలు, మండల ఓటర్ల కోసం మూడు పోలింగ్ కేంద్రాలు కలిసి మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వత్సవాయిలో జిల్లా పరిషత్ హైస్కూల్ రెండు పోలింగ్ కేంద్రాలు, పెనుగంచిప్రోలులో కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మధురంగా సాగిన గాత్ర సంగీత కచేరీ

విజయవాడ కల్చరల్: నెలనెలా యువరాగం కార్యక్రమంలో భాగంగా శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మహతిహాల్‌లో శనివారం గాత్ర సంగీత విద్వాంసురాలు తుషార పూర్ణవల్లి నిర్వహించిన కర్నాటక సంగీత గాత్ర కచేరీ మధురంగా సాగింది. వాగ్గేయకారులు రచించిన పలు సంప్రదాయ కీర్తనలను ఆమె మధురంగా ఆలపించింది. వయోలిన్‌పై కే సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై సీహెచ్ హరినాథ్ సహకరించారు.

గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు


గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకుంటున్న రైతులు, రెవెన్యూ అధికారులు

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రావెల్ అక్రమ రవాణాను రైతులు రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం అడ్డుకున్నారు. గ్రామంలోని బలుసుపాడు గ్రామ సమీపంలో సర్వే నెంబరు 85లో 3.68 ఎకరాల ప్రభుత్వ భూమిలో గత రెండు రోజులుగా కొందరు అక్రమార్కులు గ్రావెల్‌ను ఖాళీ స్థలాలు, వెంచర్లకు తరలిస్తున్నారు. గ్రావెల్‌ను గ్రామంలోని పంట పొలాలకు తోలాలని కోరినా స్పందించకుండా వెంచర్లకు ట్రాక్టర్ ట్రక్కు రూ. 400లకు విక్రయిస్తున్నారని తెలుసుకున్న రైతులు రవాణాను అడ్డుకున్నారు. అక్రమ రవాణాపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది వచ్చి గ్రామంలో జరుగుతున్న అక్రమ రవాణాను అడ్డుకున్నారు. గ్రామ సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు స్పందించకుంటే గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.